క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో త్రిశూలస్నానం



నకరికల్లు: మండలంలోని నర్శింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయంలో త్రిశూలస్నానం వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్షబిల్వార్చన వేడుకల్లో భాగంగా స్వామివారి త్రిశూలస్నాన ఘట్టం అత్యంత పవిత్రంగా జరిపించారు. అర్చకుడు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి త్రిశూలాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో కోనేటివద్దకు తీసుకువెళ్లి పూజాధికాలు నిర్వహించారు. అనంతరం కోనేటిలో త్రిశూల స్నానఘట్టం జరిపించారు. వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. స్నానఘట్టం అనంతరం విశ్వరూప అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అన్నప్రసాద వితరణలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నం



నకరికల్లు: మాదక ద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నమవుతాయని ఎస్ఐ చల్లా సురేష్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దురలవాట్లు యువతను చెడుమార్గాల వైపు తీసుకెళ్తున్నాయని అన్నారు. సమాజంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను అవగాహన కల్పించి వాటి నిర్మూలనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఇన్చార్జి హెచ్ఎం హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప ప్రజావేదిక ఇన్‌ఛార్జిగా రాఘవరాజు



అచ్చంపేట: ప్రజా సంకల్ప ప్రజావేదిక పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా మేదర రాఘవరాజును నియమిస్తూ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం రాఘవరాజు విలేకరులతో మాట్లాడారు. ప్రజా సంకల్ప ప్రజావేదిక అవినీతి రహిత సమాజం కోసం కృషిచేస్తుందన్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. తనను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రంగసాయిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పశుగ్రాస క్షేత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

అచ్చంపేట: మండలంలో పశువులు, గొర్రెలు, మేకలు పెంచుకునే రైతులు గ్రాసం కోసం తమ భూములలో కొంత భాగాన్ని కేటాయించే వారికి ప్రభుత్వం ఊరూరా పశుగ్రాస క్షేత్ర పథకం ద్వారా ఆర్థిక చేయూతనివ్వనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్వేతాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిదు ఎకరాల భూమి కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, సన్న, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులని చెప్పారు. 5 ఎకరాల భూమి కలిగినవారు పశుగ్రాసానికి 10 నుంచి 50 సెంట్ల స్థలాన్ని కేటాయించవలసి ఉంటుందన్నారు. ఈ పథకాన్ని వినియోగించుకోదలచిన రైతులు పశువైద్యాకేంద్రం, రైతుసేవాకేంద్రం, పశుగణన కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తు చేసుకున్న రైతులలో అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన రైతులు ఖచ్చితంగా బహువార్షిక గడ్డిని రెండేళ్లపాటు పెంచవలసి ఉంటుంటుందన్నారు. పూర్తి వివరాలకు సమీప రైతు సేవా కేంద్రాలు, పశువైద్యశాలలో సంప్రదించవలసినదిగా డాక్టర్ శ్వేతాదేవి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నరసరావుపేట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి తెలిపారు. మండలంలోని యల్లమందలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులకు, చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార పంపిణీపై అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సేవలను బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కడియాల తాండ వకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటుగా వెళ్లాలంటే హడలే..!

శివారు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల వెంచర్లలో జోరుగా అసాంఘిక కార్యకలాపాలు

- ఉదయం 11 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అక్కడే బస
- మద్యం, గంజాయి సేవించి జూద శిబిరాల నిర్వహణ
- మత్తులో చోరీలకు పాల్పడుతున్న దుండగులు

సత్తెనపల్లి: నియోజకవర్గ పరిధిలోని ఖాళీ స్థలాలు, కాలనీలు, శివారు ప్రాంతాలు మందు బాబులకు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. మద్యం, గంజాయి అక్రమ విక్రయాలు, జూద శిబిరాల నిర్వహణకు ఖాళీ స్థలాలు వేదికలుగా తయారవు తున్నాయి. నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో వందల వెంచర్లు వేశారు. ఇక్కడ గృహాలు, భవనాలు నిర్మించకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా రహదారుల పక్కనున్న స్థలాలను కొందరు అడ్డాగా మార్చుకొని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. దీంతో పరిసర ప్రాంత నివాసితులు, వాకర్లు భయాందోళనకు గురవుతున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలు ఇవే..

సత్తెనపల్లి పట్టణ పరిధిలోని రఘురామ్‌నగర్ గుండా లోపలికి వెళితే గార్లపాడు రోడ్డు వరకు వెంచర్లు ఉన్నాయి. వడ్డవల్లి గార్లపాడు రోడ్డులోని సాయిభాస్కర్ నగర్, గుంటూరురోడ్‌లోని పెద్ద కాలువ వద్ద, మురళీనగర్, నందిగామ అడ్డరోడ్డు సమీపంలో, నరసరావుపేట రోడ్, మాచర్ల రోడ్, అచ్చంపేట రోడ్, అబ్బూరు రోడ్ లోని ఖాళీ స్థలాలతో పాటు ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని శివారు ప్రాంతాల్లో వేసిన ఖాళీ స్థలాల వెంచర్లు సమస్యాత్మకంగా మారాయి. మద్యం సేవించి ఆయా ప్రాంతాల్లో సీసాలను పగలగొట్టడం, ఘర్షణలకు దిగటం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించటం వంటివి విచ్చలవిడిగా జరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలు సమస్యాత్మకంగా మారాయి. మత్తులో కొందరు దోపిడీలకు, చోరీలకు పాల్పడుతున్నారు. సాయిభాస్కర్ నగర్‌లోని ఓ షెడ్‌లో పాత ఇనుము క్వింటావరకు రెండు రోజుల క్రితం చోరీ చేశారు. గత నెలలో 10 మోటార్లు, కాపర్ వైర్ గుర్తు తెలియని దుండగులు అపహరించుకు పోయారని స్థానికులు తెలిపారు.



పట్టణంలోని గార్లపాడు రోడ్డులోని ఓ వెంచర్ వద్ద మద్యం సీసాలు



వెంచర్‌లో కాలువ నిర్మాణం వద్ద తాగి పడేసిన సీసాలు

ఆగడాలకు అదుపు ఏది?

ఖాళీ స్థలాల వెంచర్లలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపల్, గ్రామపంచాయతీ, రెవెన్యూ, పట్టణ ప్రాంతాల అధికారులు, పోలీసులు వెంచర్ల ఖాళీ స్థలాల యజమానులు, నిర్వాహకులతో మాట్లాడి వెంచర్లు ఖాళీ స్థలాలకు కాపలాదారులను నియమించేలా అవగాహన కల్పించాల్సి ఉంది. అనుమతులు పొందిన లేఔట్లలో వీధి దీపాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు బిగించాలి. ఖాళీ స్థలాల వెంచర్ల చుట్టూ ముళ్లతీగ, ప్రహరీ ఏర్పాటు చేయాలి. పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి మందుబాబుల ఆగడాలు అదుపు చేసేలా గస్తీ నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

6 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

రాజుపాలెం: ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామాలలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దుర్గేష్‌రావు మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభలు జరుగుతాయని తెలిపారు. 6వ తేదీన నెమలిపురి–1గ్రామ సచివాలయంలోను, 10వ తేదీన నెమలిపురి–2 , 12 కోటనెమలిపురి, 13 అనుపాలెం, అంచులవారిపాలెంలకు అనుపాలెం, 17 చౌటపాపాయపాలెం, 19 రాజుపాలెం, 21వ తేదీన రెడ్డిగూడెం, మొక్కపాడు గ్రామాలకు రెడ్డిగూడెం గ్రామ సచివాలయంలో, 24 గణపవరం–1,2, 26 బలిజేపల్లి, 28వ తేదీన ఉప్పలపాడు, ఇనిమెట్ల గ్రామాలకు ఉప్పలపాడు గ్రామ సచివాలయంలో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు. ఈ సభల్లో గ్రామ స్థాయి అధికారులందరు పాల్గొంటారని తెలిపారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

నకరికల్లు: త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి దైవజ్ఞానం పెంపొందించుకోవాలని జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దారెడ్డి సూచించారు. మార్గశిరమాసం పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని దేవవరం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం మంగళవారం చేపట్టారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సీఐ వెంకట ప్రసాద్

అచ్చంపేట: నేటి తరం యువత సెల్‌ఫోన్లకు బానిసలై సైబర్ నేరగాళ్ల బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. మండలంలోని తాళ్లచెరువులోగల సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో మంగళవారం సైబర్ నేరాలు, యువత వారిబారిన పడి ఎలా తప్పుదోవ పడుతున్నారనే విషయాలను విద్యార్థులకు వివరించారు. జీవిత అంకంలో మొదటి 25 సంవత్సరాలు కష్టపడితే మిగిలిన 75 సంవత్సరాలు సుఖంగా జీవించవచ్చని సీఐ తెలిపారు. ఈవ్ టీజింగ్‌లకు పాల్పడితే కేసులతో జీవితం అంధకారమవుతుందన్నారు. జీవితంలో బాగా రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని సీఐ ఆకాంక్షించారు. హెచ్ఎం మేరీ వినయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి: సమాజంలో జరిగే మంచి, చెడులపై విద్యార్థులు అవగాహన ఏర్పరుచుకోవటం అవసరమని పోలీస్ సర్కిల్ ఇనస్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ ఎవర్నెస్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి గురుకుల పాఠశాల ఇంచార్జి మేరీ కళ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాసరావు డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరించారు. సినిమాల ప్రభావంతో విద్యార్థులు చెడు అలవాట్లకి బానిసలు కాకూడదన్నా రు. ఎస్ఐ రాజశేఖర్, గురుకుల పాఠశాల సిబ్బందితో పాటుగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ వెంకటప్రసాద్

బెల్లంకొండలో...

బెల్లంకొండ: కళాశాలలో విద్యార్థులు తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని ఎస్ఐ డి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మంగళవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మీతో మేము' కార్యక్రమంలో భాగంగా యాంటీ డ్రగ్ యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.లక్ష్మీ సులోచన, బాలికా నోడల్ ఆఫీసర్ జి.కుసుమ కుమారి, అధ్యాపకులు ఎ.రత్న కుమారి, బీవై సత్యప్రభ, షేక్ రిహానా, వై.రమేష్ బాబు, ఎం.సాంబశివరావు విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పెదకూరపాడు ఎస్సై బాలు నాయక్ అన్నారు. పెదకూరపాడులోని అభినందన కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాజుపాలెం: మండలంలోని పెదనెమలిపురిలో గల రైతుసేవాకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారులు, మధ్యవర్తులు లేకుండా ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు దశలో రైతులు నష్టపోకుండా చూస్తామని తెలిపారు. ఆర్డీఓ రమాకాంత్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి సుశీల, ఏడీఏ రవికుమార్, క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, జీడీసీఎంసీ బీఎం హరిగోపాల్, మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య, తహసీల్దార్ దుర్గేషరావు, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

క్రోసూరు: బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్ అన్నారు. మంగళవారం అమరావతి, గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరు పీహెచ్‌సీలో బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన అనే అంశంపై ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుడ్‌షెపర్డ్ సంస్థ మండల ఇంచార్జి తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ పిల్లలు దేశ సంపద అని, వారిని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నిర్మూలించాలన్నారు. గుడ్ షెఫర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ తమ సంస్థ 74 దేశాల్లో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న హింసలకు వ్యతిరేకంగా, బాలల హక్కులపై పనిచేస్తుందన్నారు. ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్, పర్యవేక్షకులు ప్రభావతి, అమర జ్యోతి, శివుడు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమయమివ్వాలి.. పరిహారం పెంచాలి

అధికారులకు, గ్యాస్ పైపులైన్ సంస్థ ప్రతినిధులకు స్పష్టం చేసిన రైతులు

నకరికల్లు: సాగులో ఉన్న పైరు కోత కోసేవరకు సమయం ఇవ్వాలని.. పరిహారం పెంచాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. మండలంలోని నర్శింగపాడు గ్రామంలో గ్యాస్‌పైపు లైన్లను వేసే పొలాల రైతులతో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. బీపీసీఎల్ సంస్థ ఆధ్వర్యంలో గ్యాస్ పైపులైన్ నిర్మాణంలో భాగంగా 46మంది రైతులకు చెందిన పొలాల్లో గుండా పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. పరిహారం విషయమై రైతులతో గ్రామసభ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం పొలంలో పంట వేసి ఉందని పంటకోతకు 3నెలల సమయం పడుతుందని పంటకోత కోసేవరకు సమయం ఇవ్వాలని కోరారు. సెంటు భూమికి సుమారు రూ12వేల వరకు పరిహారం ఇస్తే సరిపోదని పరిహారం పెంచాలన్న డిమాండ్‌లు వ్యక్తపరిచారు. సభలో పాల్గొన్న తహసీల్దార్ కె.పుల్లారావు మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవికి నివేదిక పంపిస్తామని అన్నారు. పైపులైన్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ రైతుల డిమాండ్లను తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.



అధికారుల వద్ద తమ డిమాండ్లను వినిపిస్తున్న నర్శింగపాడు గ్రామ రైతులు

దివ్యాంగులకు మనోధైర్యం కల్పించాలి

నకరికల్లు: దివ్యాంగుల్లో మనోధైర్యం నింపి వారి ఎదుగుదలలో భాగస్వామ్యులు కావాలని ఎంఈఓ–2 ఎంఎల్ఎం ప్రసాద్ సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల కోసం సర్వశిక్షా అభియాన్ ద్వారా భవితకేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైకల్యాలు 20 రకాలకు పైగా ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకొని దివ్యాంగులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. సమీపంలోని భవితకేంద్రం పాఠశాలలో పిల్లల పేర్లు నమోదు చేసుకుంటే నైపుణ్యాలను పెంచేవిధంగా ప్రత్యేక విద్యను అందిస్తారని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తారని అన్నారు. ప్రభుత్వం ద్వారా అందజేసే ఉపకరణాలు, పరికరాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభను చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు టి.జయలక్ష్మి, బి.రమేష్, మండల కో–ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, సీఓ ఎస్.అంజమ్మ, సీఆర్పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని, దివ్యాంగులు ఉన్నత లక్ష్యాలతో వైకల్యాన్ని అధిగమించాలని ఎంఈఓ బాలసుందరరావు తెలిపారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం 'అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలు పోటీలలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, ఉపాధ్యాయులు సి.జయ వీరవెంకటేష్, ఫిజియోథెరపీ డాక్టర్ రాంబాబు, పాఠశాల హెచ్ఎం పాపమ్మ, ఉపాధ్యాయులు కరిష్మా, హుస్సేన్‌బి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజుపాలెం: ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తుందని, దీనిని దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ–1 మల్లిఖార్జున శర్మ తెలిపారు. మండలకేంద్రంలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో ఉన్న భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ–2 నరసింహారావు, పాఠశాల హెచ్ఎం పి.సీతారావమ్మ, ఐఈఆర్‌టీ మార్తమ్మ, డి.మోహన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ–2 ఎంఎల్ఎం ప్రసాద్, సిబ్బంది

సత్తెనపల్లి: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో దివ్యాంగులు సకలాంగులకు ఏమాత్రం తీసిపోరని ఎంఈఓ శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో గల భవిత కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వికలాంగత్వం కేవలం శరీరానికే కానీ మనసు కాదన్నారు. మండల లీగల్ అడ్వైజర్, న్యాయవాది డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలన్నారు. ఐఈడీ ఉపాధ్యాయుడు ఏవీ శ్రీనివాస్ మాట్లాడుతూ భవిత కేంద్రంలో అందించే సేవలను మండలంలోని ప్రతి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన పిల్లలకు, తల్లిదండ్రులకు బహుమతులు అందించారు. పారాలీగల్ వలంటీర్ షేక్ సుభానీ, ఎంపీపీఎస్ హెచ్ఎం కె.రిబ్కా, కె.విజయ్ కుమారి తదితరులు ఉన్నారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికల అధికారుల నియామకం

సత్తెనపల్లి: సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల కానుండగా 8న సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనుంది. ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. సత్తెనపల్లి మండలంలో మొత్తం 15 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కాగా ఒక్కో సాగునీటి సంఘానికి 12 టీసీలు (ప్రాదేశిక నియోజక వర్గం) చొప్పున 180 ఉన్నాయి.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ముప్పాళ్ళ: మండలంలో త్వరలో జరిగే ఆరు సాగునీటి సంఘాలు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా విధులు నిర్వహించాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం ఆర్బీకేలో సాగునీటి సంఘాల ఎన్నికల సన్నాహక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఐదు పాఠశాలల్లో పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆ మేర ఎలక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌లను నియమించటం జరిగిందన్నారు. దమ్మాలపాడు, ముప్పాళ్ళ, గోళ్ళపాడు, తొండపి, మాదల గ్రామాల్లోని పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. పంచాయతీ సిబ్బంది కూడా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కావాల్సిన వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ పీజే విలియమ్స్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీ ప్రసాదు, ఎన్నెస్పీ ఏఈ సుందరరావు, ఆయా గ్రామాల పంచాయతీకార్యదర్శులు, వీఆర్వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక కూల్చివేతపై వివాదం

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో సుమారు ఇరవై సంవత్సరాల నుంచి ఇద్దరు వ్యక్తుల ఆధీనంలో ఉన్న స్థలాన్ని ఖాళీచేయించే క్రమంలో వివాదం ఏర్పడింది. ఈవివాదంపై తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు సమాచారం ప్రకారం.. లేమల్లె గ్రామానికి చెందిన మేకల ప్రసాద్, మేకల లక్ష్మణ్‌లు గ్రామ పంచాయతీకి చెందిన స్థలంలో పశువులపాక, గడ్డివామి వేసుకుని ఉన్నారన్నారు. ఈస్థలంపై ఇటీవల గ్రామపంచాయతీ అధికారులకు స్మశాన వాటికకు వెళ్ళటానికి, అలాగే డంపింగ్‌యార్డుకు వెళ్లటానికి పశువులపాక అడ్డుగా ఉందని ఫిర్యాదులు అందాయి. దీనిపై రెవెన్యూ అధికారులకు స్థలం సర్వే చేసి హద్దులు వేసి అప్పగించాలని ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో మంగళవారం పోలీస్, రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆక్రమణలను తొలగించే సమయంలో అనుభవదారుడు ప్రసాద్, లక్ష్మణ్‌లు తమకు ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా తొలగించటం నిబంధనలకు విరుద్ధమని అడ్డుపడటంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. సర్వేలో గ్రామ పంచాయతీకి చెందిన స్థలంగా నిర్ధారణ జరిగిందని అందువల్ల నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆక్రమణలు తొలగించి హద్దులు నిర్ణయించారు. దీనిపై వారు మాట్లాడుతూ తమకు కనీసం రెండువారాల ముందు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా తమ పాకలను తొలిగించారన్నారు. తాము గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా వ్యవహరించటంవల్లే అధికారపార్టీ నాయకులు కక్షసాధింపు చర్యలకు దిగారన్నారు. తమ దగ్గర ఉన్న స్థలపత్రాలను చూపించేందుకు పదిరోజులు సమయం ఇవ్వమన్నా ఇవ్వకుండా పశువులపాకలను కూల్చటం దారుణమన్నారు.



పశువులపాకను తొలగిస్తున్న దృశ్యం

ఆరోగ్య సమాచారం పొందుపరచాలి

బెల్లంకొండ: ప్రతి ఒక్కరి శారీరక, మానసిక ఆరోగ్య సమాచారాన్ని త్వరితగతిన నమోదు చేయాలని మండల ఆయుర్వేద వైద్యుడు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ఆశా డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ్‌కా ప్రకృతి పరీక్షణ్ యాప్‌లో ఆరోగ్య వివరాలు నమోదుపై వైద్య ఆరోగ్య సిబ్బందితో చర్చించారు. పీహెచ్‌సీ, ఆయుర్వేద సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందికి ఆయుర్వేద మందులను అందజేస్తున్న వైద్యుడు

విద్యార్థులకు బహుమతులు అందజేత

సత్తెనపల్లి: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వక్తృత్వ పోటీలు దోహదపడతాయని స్వామి వివేకానంద చైతన్య భారతి ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికపై పట్టణంలోని కళాశాల విద్యార్థులకు స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు నిర్వ హించారు. భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా మంగళవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇంటర్మీడియట్ విభాగంలో శ్రీబాబా గురుదేవ్ కళాశాలకు చెందిన వల్లూరి ప్రశాంతి, మొగల్ బేగం, విద్యా కేంద్రం కళాశాలకు చెందిన వైష్ణవిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. డిగ్రీ విభాగంలో విద్యా కేంద్రానికి చెందిన రిజ్వానా, ఐశ్వర్య లక్ష్మి, గాయత్రిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కై వసం చేసుకున్నారు. విజేతలను ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లతోపాటు బహుమతులు అందించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. స్వామి వివేకానంద చైతన్య భారతి కార్యదర్శి కాకాని శ్రీనివాసరావు, సభ్యులు అబ్బూరి సత్యనారాయణ, దేవరశెట్టి రవి కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న పుట్టి సాంబశివరావు

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం, తొండపి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని తుఫాన్ నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. వరి రైతులు పంటపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. శనగ వేసే రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నీలిమ, రైతులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించే విధంగా రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని కందిపాడు, బెల్లంకొండ గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి పైరు కోతలు కోస్తున్న సమయంలో ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. చంద్రాజుపాలెంలో వరిలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. రైతు మన్నెం కేశవరెడ్డి పొలంలో 5–5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోయగా తడి ధాన్యం బరువు 16.90 కేజీలుగా నమోదు అయినట్లు తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రసాదరావు, శ్యాం ప్రకాష్, డి.రజిని పాల్గొన్నారు.